సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



అన్నదాన పథకానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అర్జ లక్ష్మి (తుని మండలం రేఖ వానిపాలెం) రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం సమర్పించారు.




రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి నందుల వెంకట నాగ నరసింహశాస్త్రి, కనకదుర్గా భవాని దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1850, మధ్య డెల్టాకు 1200,పశ్చిమ డెల్టాకు 3200 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 7.00 అడుగులకు నీటి మట్టం చేరింది.



కొనుగోలు పక్కా.. ఏర్పాట్లు ఎంచక్కా..



ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లిలో రబీ వరి కోతలు

- రబీ ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు
- ప్రతి గింజా కొనుగోలు చేసేలా చర్యలు
- జిల్లాలో 1,71,761 ఎకరాల్లో రబీ వరి సాగు
- 6.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రబీ వరి కోతలు ఆరంభమయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఆరంభం కానున్నాయి. వారం పది రోజుల్లో కోతలు జోరందుకోనున్నాయి. ఈ ఏడాది ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చే అవకాశముంది. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1,71,761 ఎకరాల్లో రబీ వరి సాగు జరిగింది. సుమారు 6.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుంది. కొన్నిచోట్ల 55 బస్తాలకు పైబడి దిగుబడి వస్తోందని అంచనా వేస్తున్నారు. అంచనాలకు మించి దిగుబడి వస్తూండటంతో ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి గింజా కొనుగోలు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పక్కాగా చర్యలు తీసుకుంటోంది. దిగుబడికి తగిన విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గోనె సంచులు, రవాణాకు అవసరమైన ట్రాక్టర్లను, లారీలను సిద్ధం చేయడం వంటి పనులు చేస్తోంది.

389 ఆర్‌బీకేల ద్వారా..

జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల్లో రబీ వరి కోతలు, ధాన్యం పట్టుబడులపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే ధాన్యాన్ని ముందుగానే అంచనా వేసుకుని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 250 క్లస్టర్ల పరిధిలోని 389 రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే ముమ్మిడివరం మండలం అయినాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఈ నెల 5వ తేదీన లాంఛనంగా ఆరంభించారు.

కంట్రోలు రూముల ఏర్పాటు

ధాన్యం అమ్మకాల్లో ఎటువంటి సమస్య ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. 83094 32487, 94416 92272 నంబర్లతో ఇవి పని చేస్తాయి. అవసరమైన రైతులు ఈ నంబర్లలో సంప్రదించి సహాయం పొందవచ్చు.

ఇదీ కొనుగోలు ధర

సాధారణ రకం ధాన్యం 75 కేజీలు రూ.1,530కి, గ్రేడ్-ఎ రకం 75 కేజీలు రూ.1,545కు కొనుగోలు చేస్తారు.



ముమ్మిడివరం మండలం అయినాపురంలో ఈ నెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, జేసీ ధ్యానచంద్ర

విస్తృతంగా ఏర్పాట్లు

- జిల్లాలో ఖరీఫ్ ధాన్యం పక్కాగా సేకరించినా కొన్ని ప్రాంతాల్లో లోపాలు చోటు చేసుకున్నాయి. అమలాపురం మండలంలోని రైతులు ట్రాక్టర్ల మీద కలెక్టరేట్‌కు ధాన్యం తీసుకువచ్చి ధర్నా చేశారు. ఈసారి అటువంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకున్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన సంచులు సిద్ధం చేశారు. ధాన్యం కొనుగోలుపై మండల అధికారులకు జేసీ ధ్యానచంద్ర, జిల్లా పౌర సరఫరాల అధికారి తులసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇప్పటికే అవగాహన కల్పించారు.
- ఆర్‌బీకేల వద్ద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (వీఏఏ), ఈ-క్రాప్, తేమ శాతం నిబంధనల ప్రకారం ధాన్యం సేకరిస్తారు. ధాన్యం నమూనాల పరిశీలన అనంతరం వీఏఏలు మొబైల్ యాప్‌లో కూపన్లు రూపొందించి రైతులకు జారీ చేస్తారు.
- గోనె సంచులు, హమాలీలు, రవాణాను మ్యాపింగ్ చేయనున్నారు. తక్కువ శ్రేణి గింజలు, కేళీలు తదితర నాణ్యత పరీక్షలు నిర్వహిస్తారు.
- ధాన్యం కొనుగోలులో గ్రామ వలంటీర్లను కూడా భాగస్వాముల్ని చేయనున్నారు.
- మండల అధికారుల అవసరాల మేరకు కాటాలు, తూనిక యంత్రాలను తూనికలు, కొలతల నియంత్రణ అధికారులు సిద్ధం చేయనున్నారు.
- రైతుల పొలాల నుంచి రైస్ మిల్లుల వరకూ రవాణాకు ఉపయోగించే వాహనాలను రవాణా శాఖ రిజిస్ట్రేషన్ చేయనుంది. వాహనాల రవాణా చార్జీలు ఎవరికి చెల్లించాలనే విషయంపై పక్కాగా డేటా ఎంట్రీ చేయనున్నారు.
- ధాన్యం కొనుగోళ్లకు మండల వ్యవసాయ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించనున్నారు.

పటిష్ట ఏర్పాట్లు



జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్‌బీకేల ద్వారా ప్రతి గింజా కొనుగోలు చేస్తాం. ధాన్యం సేకరణకు అన్ని ఆర్‌బీకేల వద్ద అవసరమైన సామగ్రిని, గోనె సంచులను సిద్ధం చేశాం.

– తులసి, జిల్లా పౌరసరఫరాల అధికారి

చేరువవుతూ.. చేసిన మేలు చెబుతూ..

- జిల్లాలో అట్టహాసంగా జగనన్నే మా భవిష్యత్
- ప్రజల వద్దకు వెళ్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు



అమలాపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



రామచంద్రపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

సాక్షి, అమలాపురం: నిన్న 'గడప గడపకూ మన ప్రభుత్వం'.. నేడు 'జగనన్నే మా భవిష్యత్'తో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరవవుతున్నారు. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అట్టహాసంగా ఆరంభమైంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా గృహసారథులు, కన్వీనర్లు, పార్టీకి చెందిన వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులు, పార్టీ జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు కూడా కోలాహలంగా పాల్గొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి నాడు – నేడు పాలనలో వ్యత్యాసాన్ని వివరిస్తున్నారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు, సామాన్యులకు జరుగుతున్న మేలును వివరిస్తున్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ వారితో మమేకమవుతున్నారు. లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేసి, వారి ఆమోదంతో వారి ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ మిస్డ్ కాల్ చేయించారు.

- అమలాపురం పట్టణం 14వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, సీఎం జగనే మన భవిష్యత్ అని తెలిపారు. ఆయనతో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. అల్లవరం మొల్లేటి వారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు.
- రామచంద్రపురం పట్టణం 18వ వార్డు మధ్య నగర్‌లో 'జగనన్నే మా భవిష్యత్'ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి నాటి టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య తేడాను వివరించారు.
- రావులపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్'ను ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఇంటింటా తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన మేలును, ఒనగూడిన సంక్షేమాన్ని వివరించారు.
- ముమ్మిడివరం నగర పంచాయతీ 16వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనరంజకమైన ప్రస్తుత సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్‌ను మరోసారి సీఎంను చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
- మండపేట పట్టణం 18వ వార్డు, తాపేశ్వరం గ్రామాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.
- అంబాజీపేట మండలం వాకలగరువు, మామిడికుదురు మండలం నగరం గ్రామాల్లో 'జగనన్నే మన భవిష్యత్' కార్యక్రమాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య పాలనలో ఉన్న తేడాను వివరించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనన్న పాలననే తీసుకురావాలని పిలుపునిచ్చారు.
- మలికిపురం చొప్పలవారి గ్రూపులో ఈ కార్యక్రమాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు.



రావులపాలెంలో లబ్ధిదారుని ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ముమ్మిడివరంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

ప్రజలతో మరింతగా మమేకమవుతాం


- నాలుగేళ్ల సంక్షేమాన్ని ఇంటింటా చెబుతాం
- అన్నీ చేశామన్న నమ్మకంతోనే వారి ముందుకు వెళ్తున్నాం
- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ప్రతి ఇంటినీ సందర్శిస్తాం
- మంత్రి పినిపే విశ్వరూప్



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గత నాలుగేళ్లుగా నవరత్న పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకూ అందుతున్న సంక్షేమ సమాచారాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి చెబుతాం. ఇచ్చిన హామీలన్నీ దాదాపు పూర్తి చేశామన్న నమ్మకంతోనే ప్రజలు ముందుకు వెళుతున్నాం. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా రెండు వారాల పాటు ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మమేకమవుతాం' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద డీఎస్ఎస్ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం గురించి వివరించారు. ఇప్పటికే 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా ప్రజల ముంగిటకు వెళ్లిన తాము ఇప్పుడు ఈ కార్యక్రమం ద్వారా మళ్లీ వెళ్తున్నామని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో జరిగే ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటినీ, ప్రతి వ్యక్తినీ కలిసి ఇప్పటికే అందిన, భవిష్యత్‌లో అందనున్న సంక్షేమం గురించి వివరిస్తున్నామని తెలిపారు. సంక్షేమపరంగా దేశ చరిత్రలోనే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్న పథకాలతో పాటు ఇతర కార్యక్రమాల ద్వారా గడచిన నాలుగేళ్లలో సీఎం జగన్ రూ.2 లక్షల కోట్ల మేర సంక్షేమాన్ని ప్రజలకు నేరుగా అందించారని గుర్తు చేశారు. డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానంటూ గతంలో చంద్రబాబు ముఖం చాటేశారని, అదే ప్రస్తుత సీఎం జగన్ నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని చెప్పి, ఇప్పటికే మూడు విడతలు అమలు చేశారని చెప్పారు. చంద్రబాబు అప్పట్లో రాష్ట్రంలో 34 లక్షల మందికి మాత్రమే పింఛన్లు అందిస్తే.. నేడు జగన్ 64 లక్షల మందికి పూర్తి పారదర్శకంగా ఎలాంటి సిఫారసులూ లేకుండా నేరుగా ఇంటికే వెళ్లి అందించే ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఏటా పెంచుతున్న మొత్తాలతో ఇప్పుడు రూ.2,750 ఇస్తుండగా వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి విశ్వరూప్ గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ అమలాపురం పట్టణ, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ మండలాల అధ్యక్షులు సంసాని బులినాని, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జీ, బొంతు గోవిందశెట్టి, మంత్రి తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని దీక్ష చేపట్టిన భక్తులు



దీక్ష స్వీకరించిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో పలువురు భక్తులు శుక్రవారం స్వామివారి దీక్ష స్వీకరించారు. ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యాన 17 మంది భక్తులు 27 రోజుల దీక్ష మాలధారణ చేశారు. అనంతరం స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీలో కారుణ్య పోస్టులు భర్తీ చేస్తున్నాం

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపడుతూనే ఉన్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కూడా చేశామని తెలిపారు. స్థానిక కాటస్ అతిథి గృహం వద్ద శుక్రవారం విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. 2016కు ముందు కారుణ్య నియామకాల విషయంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం చూపారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కారుణ్య నియామకాల్లోనే కాకుండా, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, చరిత్రలోనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు.

అల్లర్ల కేసుల ఎత్తివేతపై ఎస్సీ నేతలతోనూ సీఎం చర్చిస్తారు

అమాయక యువకులు, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడకూడదనే ఉద్దేశంతోనే అమలాపురం అల్లర్ల కేసులు ఎత్తివేసేందుకు సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని మంత్రి విశ్వరూప్ తెలిపారు. నాటి అల్లర్లలో నష్టపోయిన తనతోను, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌తోను ముఖ్యమంత్రి చర్చించిన తరువాతే కేసుల ఎత్తివేత నిర్ణయం జరిగిందని చెప్పారు. ఈ కేసుల్లో అమాయకులు బలి కాకూడదని, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యంగా భావించి ఎత్తివేతను స్వాగతిస్తున్నామని అన్నారు. కేసుల ఎత్తివేతపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే కోనసీమ కాపు, శెట్టిబలిజ నేతలతో చర్చించారని, త్వరలోనే కోనసీమ ఎస్సీ పెద్దలతో కూడా చర్చించేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ నెల 14వ తేదీ తర్వాత సీఎంను ఎస్సీ నేతలు కలిసే అవకాశం ఉందని చెప్పారు.

ఈ-ఫిష్ సర్వే లోపాలు సరిదిద్దేందుకు చర్యలు

అమలాపురం టౌన్: ఈ-ఫిష్ సర్వేలో లోపాల కారణంగా పదెకరాల్లోపు ఆక్వా చెరువులు సాగు చేస్తున్న కొంత మంది రైతులు సబ్సిడీ కోల్పోతున్నారని కోనసీమ ఆక్వా రైతు ప్రతినిధులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దృష్టికి శుక్రవారం తీసుకువచ్చారు. వారిద్దరినీ వేర్వేరుగా కలసిన రైతు ప్రతినిధులు ఈ సమస్యపై చర్చించారు. దీనిపై మంత్రి, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, ఫిషరీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ-ఫిష్ సర్వేలోని లోపాలను రెండు రోజుల్లో సరిచేసి, వారికి సబ్సిడీ అందేలా చర్యలు చేపడతామని అధికారులు మంత్రి, ఎమ్మెల్యేకు చెప్పారు. వారికి కోనసీమ ఆక్వా రైతు ప్రతినిధులు రుద్రరాజు నానిరాజు, త్సవటపల్లి నాగభూషణం, అల్లూరి రమేష్‌రాజు, దెందుకూరి సత్తిబాబురాజు, యాళ్ల వెంకటానందం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. సర్వే లోపాలు సరిదిద్దడం వల్ల కోనసీమలో దాదాపు 600 మంది రైతులకు సబ్సిడీ వచ్చే అవకాశాలుంటాయని కోనసీమ ఆక్వా రైతు ప్రతినిధులు తెలిపారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో జస్టిస్ జ్యోతిర్మయి




జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సారథి

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వారికి ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు సుదర్శనం రమేష్ ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని సూపరింటెండెంట్ విజయ సారథి అందించారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం



బుక్కా సేవ నిర్వహిస్తున్న అర్చకులు



ఊయలలో దేవేరులతో కొలువుతీరిన స్వామివారు

- ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు
- వేడుకగా ఊయల సేవ

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి తిరుమంజన సేవ, బుక్కా ఉత్సవం, శ్రీపుష్పోత్సవం, ఊయల సేవ తదితర క్రతువులతో ముగిశాయి. 11 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరిగాయి. స్వామి వారి పుష్పోత్సవం కోసం గర్భాలయం, ముఖ మండపాలను పరిమళభరితమైన రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. పలు రకాల ఫలాలను ఉంచారు. ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తల ఆధ్వర్యాన అర్చక స్వాములు ఈ క్రతువులను శాస్త్రోక్తంగా, కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాల్లో చలువ పందిరి అలంకరణ, విద్యుద్దీపాలు, షామియానాలు ఏర్పాటు చేసిన స్థానిక సత్యనారాయణ టెంట్‌హౌస్ యజమాని రాకుర్తి సత్యనారాయణను, ఆయన కుటుంబ సభ్యులను, సిబ్బందిని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఫణి దంపతులు స్వామి చిత్రపటాలు బహూకరించి ఘనంగా సత్కరించారు.

కరుణామూర్తి.. నిత్యస్ఫూర్తి



మండపేటలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

మండపేట: సమస్త మానవాళి పాప ప్రక్షాళన కోసం ప్రభువైన ఏసుక్రీస్తు శిలువపై రక్తం చిందించిన రోజును గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచీ ఉపవాసం పాటిస్తూ ఆయా చర్చిల్లో ప్రార్థనలు, శిలువ యాత్రలు చేశారు. మండపేట పెద కాలువ వద్ద నుంచి కలువ పువ్వు సెంటర్ వరకూ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యాన క్రైస్తవులు శిలువ మోస్తూ పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారు. క్రీస్తు వేషధారణలో ఓ వ్యక్తి శిలువను మోస్తుండగా, భటులు ఆయనను కొరడాలతో కొడుతున్నట్టు పాదయాత్రలో చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందరూ ప్రేమ, శాంతితో జీవిస్తూ క్రీస్తు అడుగుజాడల్లో నడుస్తూ, తోటివారిని ఆదరించాలని చర్చి ఫాదర్ కె.రత్నాకర్ బోధించారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొని కారు పల్టీలు

యువకుడి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



కారులోనే మృతి చెందిన జానకిరామయ్య

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం వద్ద 216ఏ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఐదుగురు గాయపడ్డారు. ఎస్సై ఎస్.శివ ప్రసాద్ కథనం ప్రకారం.. ఆలమూరుకు చెందిన కాండ్రేగుల జానకిరామయ్య (23) తన కారులో గురువారం అర్ధరాత్రి మరో నలుగురితో కలిసి రాజమహేంద్రవరం వెళ్తున్నాడు. మూలస్థాన అగ్రహారం బస్టాండ్ సెంటర్‌లోని వంతెన వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో జానకిరామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ కారులో ప్రయాణిస్తున్న నలుగురితో పాటు బైక్‌పై వెళ్తున్న మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందు, వెనుక భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రోడ్డు పక్కనే ఇటుక లోడు ట్రాక్టర్ నిలిచి ఉంది. దీనివల్లనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. క్షతగాత్రులందరినీ జాతీయ రహదారి అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై జానకిరామయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

గోపాలపురం: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలపురం ఏఎస్సై ఎం.శోభనాద్రి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన ఎలిపిన కిషోర్‌బాబు (25) ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య సరోజ, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోలీసులు గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మక ద్రోహం

- తాకట్టు దుకాణం నగల అపహరణలో గుమాస్తాయే నిందితుడు
- రూ.1.12 కోట్ల విలువైన 4.389 కిలోల స్వర్ణాభరణాల స్వాధీనం
- కొవ్వూరు భారీ చోరీ మిస్టరీని ఐదు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు

కొవ్వూరు: నగలు తాకట్టు పెట్టుకుని వడ్డీ వ్యాపారం చేసే ఆ పాన్ బ్రోకర్‌ను అతడి వద్ద పని చేసే గుమాస్తా నమ్మించి మోసం చేశాడు. యజమానికి తెలియకుండా దఫదఫాలుగా 4.389 కేజీల బంగారు ఆభరణాలు మాయం చేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. కొవ్వూరు చేపబొమ్మ వీధిలో రాజేంద్ర పాన్ బ్రోకర్స్ దుకాణంలో ఇటీవల భారీగా బంగారం మాయమవడం వెనుక ఉన్న మిస్టరీని కొవ్వూరు పోలీసులు కేవలం ఐదు రోజుల్లోనే ఛేదించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావులీ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

వ్యసనాలకు బానిసై..

రాజమహేంద్రవరానికి చెందిన శాంతిలాల్ జైన్ కొవ్వూరులో రాజేంద్ర పాన్ బ్రోకర్స్ దుకాణం నడుపుతున్నారు. సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన శెట్టి రాము ఎనిమిదేళ్లుగా గుమస్తాగా పని చేస్తున్నాడు. వయోభారం, అనారోగ్య సమస్యల వలన శాంతిలాల్ జైన్ తరచూ దుకాణానికి రాలేకపోతున్నారు. గుమస్తా రాముపై నమ్మకంతో వ్యాపార పనులు, బంగారు నగలు తాకట్టు పెట్టుకుని రుణాలు ఇవ్వడం, అప్పు చెల్లించిన వారికి తిరిగి నగలు ఇవ్వడం వంటి పనులు అప్పగించారు. దీనిని రాము అవకాశంగా తీసుకున్నాడు. యజమానికి తెలియకుండా దుకాణంలోని నగలను వేరొక చోట తనఖా పెట్టి, సొంత అవసరాలకు సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన అతడు ఇలా దఫదఫాలుగా మూడు కిలోల బంగారు ఆభరణాలను నలుగురి వద్ద తనఖా పెట్టి, వచ్చిన డబ్బులను తన వ్యసనాలకు వాడుకున్నాడు.

వెలుగు చూసిందిలా..

ఈ నెల ఒకటో తేదీన కొడుకు ఖితేష్ కుమార్ జైన్‌తో కలిసి శాంతిలాల్ జైన్ తమ దుకాణానికి వచ్చారు. తాకట్టులో ఉన్న ఆభరణాలు, అకౌంట్లను పాన్ టిక్కెట్ ప్రకారం రెండో తేదీన తనిఖీ చేయాలని నిర్ణయించుకున్నారు. సాయంత్రం రాజమహేంద్రవరం వెళ్లిపోయారు. వారు తనిఖీ చేస్తే తాను దొంగిలించిన నగల విషయం బయటపడుతుందని గుమస్తా రాము భావించాడు. షాపు మూసివేసే సమయంలో లాకర్ తెరచి, అందులోని విలువైన బంగారు నగలు వీలైనన్ని తీసుకుని వెళ్లిపోయాడు. రెండో తేదీ నుంచి అతడి ఆచూకీ తెలియరాలేదు. శాంతిలాల్ జైన్, కుమారుడు ఖితేష్ కుమార్ జైన్‌లు 2వ తేదీన దుకాణానికి వచ్చి, లెక్కలు సరి చూసుకుని, బంగారు నగలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఖితేష్ కుమార్ జైన్ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యాన పలు పోలీసుల బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు. పరారీలో ఉన్న గుమస్తా రాము కదలికలపై దృష్టి సారించారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారణ జరిపారు. దీంతో నగల అపహరణ వ్యవహారం వెలుగు చూసింది. డీఎస్పీ వర్మ పర్యవేక్షణలో మధ్యవర్తుల సమక్షంలో చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేశారు. రాము నలుగురు వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టిన మూడు కిలోల బంగారంతో పాటు అతడి వద్ద ఉన్న 1.389 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1.12 కోట్ల విలువైన ఆభరణాలను రికవరీ చేశారు. వీటిని కోర్టుకు అప్పగించనున్నారు. రామును అరెస్టు చేసి, కోర్టుకు రిమాండుకు తరలించనున్నారు.



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ. చిత్రంలో ముఖంపై ముసుగులో నిందితుడు

ఇంటి కోసం అప్పులు చేసి..

రాము కొత్తగా నిర్మించుకున్న ఇంటి కోసం రూ.30 లక్షల వరకూ అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు దఫాదఫాలుగా బంగారం అపహరించి సొమ్ము చేసుకునేవాడు. మూడేళ్లుగా ఈ అపహరణల పర్వం కొనసాగుతోంది. శాంతిలాల్ జైన్ వద్ద 500 మందికి పైగా నగలు తాకట్టు పెట్టి వడ్డీకి డబ్బులు తీసుకున్నారు. ఈ కేసును ఐదు రోజుల్లోనే ఛేదించిన డీఎస్పీ వర్మ, పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్, ఎస్సైలు పి.రవీంద్రబాబు, కేవీ రమణ, ఏఎస్సైలు ఏకే సత్యనారాయణ, ఇతర సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించేలా ఎస్పీకి సిఫారసు చేస్తామని ఏఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించిన పోలీసులు



గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించి ఆసుపత్రికి చేర్చిన ఏఎస్సై రమణమూర్తి

యానాం: గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తిని ఏఎస్సై కవల రమణమూర్తి ఆధ్వర్యాన పోలీసులు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన సలాలుద్దీన్ గురువారం అర్ధరాత్రి యానాం – ఎదుర్లంక బాలయోగి వారధి పైనుంచి గౌతమీ గోదావరి నదిలో దూకేశాడు. అటుగా వెళుతున్న కొందరు యానాం పోలీసులకు సమాచారం అందించారు. సమీపంలోనే ఉన్న ఏఎస్సై రమణమూర్తి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, మత్స్యకారుల పడవలతో సలాలుద్దీన్‌ను కాపాడి, ఒడ్డుకు చేర్చారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న సలాలుద్దీన్‌కు పోలీసులు ప్రథమ చికిత్స చేసి, తాగిన నీటిని కక్కించారు. యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించి, అత్యవసర చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

కన్నుల పండువగా శ్రీపుష్పోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు



పూల ఊయలలో శయనిస్తున్న శ్రీ, భూ సమేత స్వామివారు

ఆత్రేయపురం: కల్యాణోత్సవాల్లో భాగంగా కోనసీమ తిరుపతి– వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శ్రీపుష్పోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. వైఖానస పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన వేద పండితులు, అర్చక స్వాములు ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 11 రకాల పిండివంటలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి, 121 రకాల మంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని అద్దాల మండపంలో సుగంధభరిత విరులతో అలంకరించిన ఊయలలో స్వామి, అమ్మవార్లను జోలపాటలతో శయనింపజేశారు. వందలాది మంది దంపతులకు దంపతి తాంబులాలు అందించారు. ఈ ఉత్సవంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, బాలభోగం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముసుగు దొంగల హల్‌చల్

- అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన దుండగులు
- కత్తితో కిరాణా వ్యాపారిపై దాడి
- స్వల్పంగా గాయపడిన బాధితుడు
- ధైర్యంగా ఎదుర్కోవడంతో భారీ చోరీ యత్నం విఫలం
- అమలాపురం గాంధీనగర్‌లో ఘటన

అమలాపురం టౌన్: ఇద్దరు ముసుగు దొంగలు ఓ ఇంట్లోకి చొరబడి, యజమానిపై కత్తితో దాడి చేసిన ఘటన అమలాపురం పట్టణంలో కలకలం రేపింది. వారిని ఆయన ధైర్యంగా ఎదుర్కోవడంతో భారీ చోరీకి అవకాశం లేకుండా పోయింది. వివరాలివీ.. బండారు శ్రీనివాసరావు కిరాణా వ్యాపారిగా జీవనం సాగిస్తూ, పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆయన ఇంటి పెరటి వైపు ముసుగు ధరించిన దొంగలు చేరుకున్నారు. తెరచి ఉన్న ఓ కిటికీ తలుపు ద్వారా బూజుల కర్రకు చీర పీలికతో స్టీలు నాలుకబద్ద కట్టారు. దాని సహాయంతో డోర్ బోల్ట్ తీసి ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయానికి బెడ్ రూమ్‌లో శ్రీనివాసరావు, తాయారు దంపతులు నిద్రపోతున్నారు. తొలుత దొంగలు దేవుని గదిలోని 750 గ్రాముల వెండి వస్తువులు కాజేశారు. అనంతరం బెడ్ రూమ్‌లోకి ప్రవేశించారు. దీంతో మెలకువ వచ్చిన శ్రీనివాసరావు తన ప్యాంటు బెల్ట్ తీసి దొంగలను ఎదుర్కొన్నారు. దీంతో వారు కత్తులు చూపించి ఆయనను భయపెట్టే ప్రయత్నం చేశారు.



దొంగల దాడిలో గాయపడ్డ శ్రీనివాసరావు

అయినప్పటికీ వారిని శ్రీనివాసరావు ధైర్యంగా అడ్డుకున్నారు. ఈ పెనుగులాటలో ఆగ్రహించిన దొంగలు శ్రీనివాసరావు కాలిపై కత్తితో గాయం చేశారు. దీంతో గదంతా రక్తపు మరకలతో నిండింది. ఈ సంఘటన చూసి శ్రీనివాసరావు భార్య త్రీ భయాందోళనకు గురైంది. శ్రీనివాసరావు వెనక్కి తగ్గకపోవడంతో చేసేది లేక దొంగలు అప్పటికే దొంగిలించిన వెండి వస్తువులతో తాము వచ్చిన మోటార్ సైకిల్‌పై పలాయనం చిత్తగించారు. సంఘటన స్థలాన్ని అమలాపురం డీఎస్పీ వై.మాధవరెడ్డి, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి, పట్టణ ఎస్సై ప్రభాకర్ పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. గాయపడిన శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రభాకర్ తెలిపారు. గాయపడిన శ్రీనివాసరావును పట్టణంలోని రెండు చాంబర్ల అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, బోణం సత్తిబాబు, వ్యాపారులు వేర్వేరుగా పరామర్శించారు. దొంగలను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు అభినందించారు.

అనాథలకు అండగా..

- దీనజనోద్ధరణకు తోడ్పడుతున్న ఆశ్రమం
- శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఔదార్యం
- 15 ఏళ్లుగా సేవలు



దాత కందికట్ల వెంకట్రావు, నాగరత్నం దంపతులు

మామిడికుదురు: 'పతితులార భ్రష్టులార బాధాసర్పదష్టులార ఏడవకండేడవకండి' అంటూ మహాకవి శ్రీశ్రీ ఘోషించాడు. అటువంటి బాధితులను, అనాథలను, అభాగ్యులను అక్కున చేర్చుకుంటూ అండగా నిలుస్తోంది మొగలికుదురులోని భగవాన్ శ్రీ సత్యసాయి భరోసా దీన జనోద్ధరణ ఆశ్రమం. ఈ గ్రామానికి చెందిన కందికట్ల వెంకట్రావు, నాగరత్నం దంపతులు కోట్లాది రూపాయల విలువైన స్థలంలో ఈ భవనం నిర్మించి ఇచ్చారు. ఇందులో 15 ఏళ్లుగా ఎంతో మంది అనాథలైన చిన్నారులు, నిరుపేదలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థ దీని నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. దీనికయ్యే మొత్తం ఖర్చును సేవా సంస్థ సభ్యులు భరిస్తూ తమ ఔదార్యం చాటుకుంటున్నారు.

దాతల సహకారంతో..

ఈ ఆశ్రమం నిర్వహణలో ఎంతో మంది దాతలు సహకారం అందిస్తున్నారు. వారి తోడ్పాటుతోనే దీనిని ముందుకు నడిపిస్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు వృద్ధులు ఉన్నారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు నగరం ఎడ్యుకేర్ విద్యా సంస్థల అధినేత కె.మురార్జీ ఉచితంగా విద్యనందిస్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు, దుస్తులు, ఇతర సదుపాయాలకు పలువురు దాతలు సహకారం అందిస్తున్నారు. ఇక్కడ ఉంటున్న వారికి స్థానిక శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ కాశిన ప్రభాకర్ ప్రతి వారం ఉచితంగా వైద్య సేవలతో పాటు మందులు అందిస్తున్నారు. ఇలా ఎంతో మంది ఈ ఆశ్రమ నిర్వహణలో భాగస్వాములయ్యారు.



మొగలికుదురులోని భగవాన్ శ్రీసత్యసాయి భరోసా దీన జనోద్ధరణ ఆశ్రమం



ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

ఆశ్రమం అండగా నిలిచింది



నాకు నా అన్న వాళ్లెవ్వరూ లేరు. ఈ ఆశ్రమం నాకు ఎంతో అండగా నిలిచింది. ఐదేళ్ల నుంచి ఇక్కడే జీవనం సాగిస్తున్నాను. నాతో పాటు ఎంతో మంది ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. అన్ని సదుపాయాలూ కల్పిస్తూ సొంత కుటుంబ సభ్యుల మాదిరిగా నిర్వాహకులు మమ్మల్ని ఆదరిస్తున్నారు.

– వాసంశెట్టి నరసింహమూర్తి

14 సంవత్సరాలుగా..



మాది చాలా పేద కుటుంబం. నాకు కొడుకు ఉన్నాడు. అతడి సంపాదన వారి జీవనానికే సరిపోవడం లేదు. వారికి భారం కాకూడదనే నేను ఇక్కడకు వచ్చేశాను. అప్పుడప్పుడూ నా కొడుకు వచ్చి నన్ను చూసి వెళ్తుంటాడు. ఆశ్రమంలోనే 14 ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్నాను. ఇక్కడ ప్రతి ఒక్కరినీ ఎంతో బాగా చూసుకుంటున్నారు.

– చింతా పుణ్యవతి

పదేళ్లుగా ఉన్నా..



ఎంతో మంది అనాథలకు, అభాగ్యులకు ఈ ఆశ్రమం అండగా నిలుస్తోంది. ఎంతో మంది దాతలు ఇక్కడకు వచ్చి సేవలందిస్తుంటారు. నేను పదేళ్లుగా ఇక్కడ ఆశ్రయం పొందుతున్నాను. పిల్లలు ఉన్నా నన్ను పట్టించుకోవడం లేదు. వారి గురించి మాట్లాడుకోవడం అనవసరం. ఇక్కడి వారు మమ్మల్ని చక్కగా చూసుకుంటున్నారు.

– నూతిగట్టు ప్రభావతి

దాతల సహకారంతోనే..



కందికట్ల వెంకట్రావు, నాగరత్నం దంపతుల ఔదార్యంతో 15 ఏళ్ల క్రితం ఈ ఆశ్రమం ఏర్పాటు చేశాం. దీని నిర్వహణకు నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు అవుతోంది. దీని నిర్వహణలో మాకు ఎంతో మంది దాతలు అండగా నిలుస్తున్నారు.

– అడబాల కొండబాబు, జిల్లా అధ్యక్షుడు, శ్రీసత్యసాయి సేవా సంస్థ

14న కొవ్వూరుకు సీఎం జగన్

- 'వలంటీర్‌కు వందనం' కార్యక్రమం నిర్వహణ
- భారీ బహిరంగ సభ
- కలెక్టర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 14న కొవ్వూరు రానున్నారని హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. 'వలంటీర్‌కు వందనం' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణకు అవసరమైన స్థలాలను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఇతర అధికారులు, నాయకులతో కలిసి మంత్రి పరిశీలించారు. పట్టణంలోని గోష్పాద క్షేత్రం వెనుక ఉన్న ఖాళీ స్థలం, మినీ బైపాస్ రోడ్డులోని పీఆర్‌ఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఐ.పంగిడి, చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ ఖాళీ స్థలాన్ని కూడా పరిశీలించారు. సభకు వచ్చే వారికి అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై పోలీసు అధికారులతో చర్చించారు. బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం, సమయం ఇంకా ఖరారు కాలేదన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులతో కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సమీక్షించనున్నామని మంత్రి వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి జగదాంబ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత

బీఈడీ కళాశాలలో 10న స్పాట్ అడ్మిషన్లు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఈ నెల 10న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాల వ్యవధితో కూడిన ఈ కోర్సులో ప్రవేశాలు ఏపీ ఎడ్‌సెట్-2022 నియమావళిని అనుసరించి ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు 13, ఈడబ్ల్యూలకు మూడు సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్నవారు ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల మధ్య రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, సాయంత్రం 5 గంటల్లోగా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఏపీ ఎడ్‌సెట్-2022 ప్రవేశ పరీక్షకు హాజరై ఉండాలన్నారు. వివరాలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ 0883-256611, 7090 33 8473కు ఫోన్ చేసి, తెలుసుకోవచ్చన్నారు.